పోలింగ్ ప్రశాంతం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు పోటెత్తిన ఓటర్లు
- ఓటుహక్కు వినియోగించుకున్న ప్రజా ప్రతినిధులు

విజయనగరం:

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గానికి సంబంధించి విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఐదు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 20 పోలింగ్ బూత్‌లలో పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. నగరంలోని కంటోన్మెంట్ హైస్కూల్‌లో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కస్పా ఉన్నత పాఠశాలలో ఓటు వేయగా.. అంతకు ముందు ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో తన ఓటును వినియోగించుకున్నారు. మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకోగా.. మహారాజా కళాశాలలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ ఓటు వేశారు.


కంటోన్మెంట్ హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న డీసీఎంఎస్ చైర్మన్ అవనాపు భావన


సిరా ముద్రను చూపిస్తున్న మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రశాంతంగా..

నెల్లిమర్ల: మండల కేంద్రంలో ఓటర్లు బారులుతీరారు. నెల్లిమర్ల నగర పంచాయతీ, మండలంలో 81 శాతం ఓటింగ్ జరిగింది. నెల్లిమర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం కాస్త మందకొడిగా పోలింగ్ ప్రారంభమైంది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓటర్లు పోటెత్తారు. సాయంత్రం 4 గంటల తర్వాత కూడా వందల సంఖ్యలో ఓటర్లు క్యూలైన్లలో నిలబడ్డారు. రెండు పోలింగ్ కేంద్రాలకు మొత్తం 2180 మంది ఓటర్లను కేటాయించగా 1771 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. వారి వెంట పార్టీ నాయకులు అంబళ్ల శ్రీరాములనాయుడు, గదల సన్యాసినాయుడు, చనమల్లు వెంకటరమణ, చిక్కాల సాంబశివరావు, సముద్రపు రామారావు, తదితరులున్నారు.


పట్టణంలో సాయంత్రం 4 గంటలకు బారులు తీరిన ఓటర్లు

భోగాపురంలో ..

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 712 మంది ఓటర్లకు గాను 196 మంది మహిళలు, 448 మంది పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90.44 శాతం ఓట్లు నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కేకేవీ.విజయనాథ్, ఎస్సై కృష్ణమూర్తి బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఎన్నిక ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశారు. ఎంపీడీఓ దాసరి బంగారయ్య, డీటీ శ్రీనివాసరావు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


బందోబస్తును పరిశీలిస్తున్న సీఐ విజయనాథ్


మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో ఓటర్లు

పూసపాటిరేగలో...


పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ దీపికాపాటిల్, తదితరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బూత్ 111లో 589 ఓట్లకు గాను 525.. బూత్ 112లో 680 ఓట్లకు గాను 589 ఓట్లు పోలయ్యాయి. 86 శాతం ఓటింగ్ జరిగిందని అధికారులు తెలిపారు. ఎస్పీ దీపికాపాటిల్, దిశ డీఎస్పీ వెంకటేశ్వర్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కేవీవీ విజయనాథ్, ఎస్సైలు ఎ.నరేష్, హరిబాబునాయుడు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ జి.రామారావు ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.


బారులు తీరిన ఓటర్లు


ఓటుహక్కును వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో ఓటర్లు

డెంకాడలో...

డెంకాడ: మండల కేంద్రంలోని 114,115 పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. 114 బూత్‌లో 686 మంది ఓటర్లకు గాను 598 మంది... 115 బూత్‌లో 709 మంది ఓటర్లకు గాను586 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ దీపికా పాటిల్ సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్‌వీ రమణకుమారి సందర్శించి పోలింగ్ కేంద్రంలో వైద్య ఏర్పాట్లను పరిశీలించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు మండలానికి వచ్చి ఓటింగ్ సరళిపై ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ, పోలిపల్లి సొసైటీ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం, బాలి సత్యనారాయణ, తదితరులను అడిగి తెలుసుకున్నారు.


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ పరిశీలకుడు అందవరపు సూరిబాబు

ఓటింగ్ శాతం పెరుగుదలకు ప్రభుత్వ పాలనే నిదర్శనం


మాట్లాడుతున్న ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ సరళి అనూహ్యంగా పెరగడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనే నిదర్శనమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నగరంలోని ఐదు ప్రధాన పోలింగ్ స్టేషన్‌లలో 20 పోలింగ్ బూత్‌లలో ఎన్నిక ప్రశాంతంగా జరిగిందన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం, ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారని తెలిపారు. ముఖ్యంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనా తీరును ప్రజల చెంతకు తీసుకువెళ్లడంతో ఓటింగ్ సరళి పెరిగిందని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికల్లో టీడీపీ కేవలం తన ఉనికిని కాపాడడం కోసమే అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలిపారన్నారు. బోగస్ ఓట్లు నమోదయ్యాయని ప్రతిపక్షం విమర్శించడం విడ్డూరంగా ఉందని, గత ఎన్నికల్లో బోగస్ ఓట్లతోనే గెలుపొందుతూ వచ్చారా అని ప్రశ్నించారు. టీడీపీ అనుకూల పత్రికలు, మీడియా సంస్థల్లో తప్పుడు కథనాలు ప్రచురించడం తగదన్నారు. సామాజిక మాధ్యమాలు పెరిగిన నేపథ్యంలో తప్పుడు వార్తలను ప్రజలు నమ్మరని తెలిపారు.

సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయం


మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రామభద్రపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు జోష్యం చెప్పారు. ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మండల కేంద్రంలో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఓటరు స్లిప్పుల పంపిణీ శిబిరాన్ని పరిశీలించిన వారు పోలింగ్ జరుగుతున్న తీరును ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వారు పోలింగ్ సరళిని పరిశీలిస్తే సీతారాం గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, కనిమెరక అప్పారావు, చొక్కాపు శ్రీనివాసరావు, నాగిరెడ్డి కామేశ్వరరావు, చింతల ఉమామహేశ్వరరావు, కనిమెరక శ్రీనివాసరావు,పెంకి శేఖర్, పువ్వల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ శిబిరాలను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల జరుగుతున్న తీరు, పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ప్రజాసంక్షేమానికే ప్రజలు పట్టంగడతారని, ప్రజల బాగోగుల కోసం పరితపించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కే ఓటర్లు ఓటు వేశారని, ఆయన గెలుపు ఖాయమన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, పరిశీలకుడు అందవరపు సూరిబాబు, తదితరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు పరిశీలించారు. 1245 ఓట్లకు గాను 1078 పోలయ్యాయి. పరిశీలనలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు ఎస్. సత్యనారాయణ రాజు, అల్లాడ రమేష్, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, దాడిశెట్టి త్రినాథరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

శిబిరాల తొలగింపు..


భోగాపురంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డితో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణమూర్తి

భోగాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా వివిధ పార్టీల వారు ఏర్పాటు చేసిన శిబిరాలను పోలీసులు తొలగించారు. ఎస్సై కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురంలలో సోమవారం పర్యటించి పార్టీ నాయకులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లకు దగ్గర వేసిన టెంట్లను తొలగించి, వేరే చోటుకు మార్చారు.

పెదపోలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే


పెదపోలమ్మ ఘటాలకు పూజ చేసి, స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో జరుగుతున్న పెదపోలమ్మ సంబరాలకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆరోజు జరిగే పండగకు హాజరు కాలేకపోతున్నానని, అందుకే ఇప్పుడు వచ్చానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దాడితల్లి సేవలో ఎమ్మెల్యే

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు గొల్లపల్లి దాడితల్లి అమ్మవారిని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం దర్శించుకున్నారు. మే 1, 2, 3వ తేదీల్లో జరగనున్న పండగ నేపథ్యంలో ఆయన అమ్మవారికి ముందస్తుగా పూజలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం


శిబిరంలో వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఓటు వేసేందుకు వచ్చిన వారిలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారికి వెంటనే వైద్యసేవలు అందేలా ఈ శిబిరం ఏర్పాటు చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి అనిరినాయుడు తెలిపారు.

విత్తనగుళికల తయారీపై అవగాహన


రైతులకు విత్తనగుళికల తయారీపై వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో విత్తనగుళికల తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ సీహెచ్ శారద, గౌరీశ్వరరావు, పార్వతమ్మ విత్తనగుళికల తయారీని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. తొమ్మిది రకాలైన విత్తనగుళికల తయారీకి ముందు బీజామృతంతో విత్తన శుద్ధిచేసి, తర్వాత బంకమట్టి, ఘన జీవామృతం, బూడిద, సరిపడ నీరు, ఒకదాని తర్వాత ఒకటి వేసి నానబెట్టాలి. ఇలా చేసిన విత్తనాలను పొలంలో జల్లుకుంటే పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కె.రమణ పాల్గొన్నారు.